కీసరగుట్టలో ద్వితీయ బొడ్రాయి వేడుకలు

కీసరగుట్టలో ద్వితీయ (నాభిశిలా)బొడ్రాయి వేడుకలు ఘనంగా జరిగాయి. గత సంవత్సం బొడ్రాయి మహోత్సవాలను నిర్వహించగా.. ఈ ఏడాది కూడా రెండవ బొడ్రాయి వేడుకలను వైభోపేతంగా నిర్వహించారు. కీసర మాజీ ఎంపీటీసీ బెలిదే రమేశ్‌గుప్త, కీసరగుట్ట కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు. **– కీసర, మార్చి 21**

న్యూ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

శామీర్‌పేట, మార్చి 21: న్యూకాలనీ, ఎల్‌ఆర్ గ్రీన్ హోమ్స్ కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని ఆయా కాలనీల అధ్యక్షులు గోపు శ్రీనివాస్, విజయ్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తూంకుంట మున్సిపల్ 15వ వార్డులోని పోతాయిపల్లిలోని న్యూకాలనీ, ఎల్‌ఆర్ గ్రీన్ హోమ్స్ కాలనీల్లో గత రెండేండ్లుగా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామన్నారు. కాలనీల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్డు, ఎలక్ట్రికల్ పోల్స్ సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సమస్యలపై పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు అందజేశామన్నారు. తమ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలుగా, తూంకుంట మున్సిపల్ వాసులుగా గుర్తించాలని కోరారు. సమస్యను పరిష్కరించకుంటే ఈ నెల 24న నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

‘లిటిల్ ఫ్లవర్’లో డేటా సైన్స్ ఫర్ హర్

వి ఫోర్ సొల్యూషన్ లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

రామంతాపూర్, మార్చి 21: ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల, డీడ్ అనే ఎన్జీఓ సహకారంతో, హిందుజా గ్లోబల్ సొల్యూషన్స్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా నాస్కాం ఫౌండేషన్ స్పాన్సర్ చేసిన కళాశాలలోని బాలికల కోసం డేటా సైన్స్ ‘స్కిల్స్ ఫర్ హర్’ అనే కోర్సును నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పి.జయంతిరెడ్డి తెలిపారు. ‘స్కిల్స్ ఫర్ హర్” వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిల్పా స్నిహ్వా హర్ష్, సీనియర్ మేనేజర్ నగేశ్ మెహెందలే, ఫౌండేషన్ మేనేజర్ అశుతోశ్ నేమా, ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ అములన్ చెటియా, ఫౌండేషన్ భాగస్వామ్యాల మేనేజర్, పూర్ణ చౌదరి, జార్జ్ స్టీఫెన్ పాల్గొన్నారు. ఎల్‌ఎఫ్‌డీసీ నుంచి 21మంది విద్యార్థులు వీ ఫోర్ యూ సొల్యూషన్‌లో స్థానం పొందారు. ఈ సందర్భంగా వారికి ఆఫర్ లెటర్లు అందజేశారు.

పది పరీక్షలు షురూ

రామంతాపూర్ జిల్లా పరిషత్ స్కూల్ వద్ద హాల్‌టికెట్ తనిఖీ చేసి హాల్‌లోకి విద్యార్థులను పంపుతున్న సిబ్బంది



కాప్రా జిల్లా పరిషత్ హైస్కూల్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందడి

మేడ్చల్ కలెక్టరేట్/మేడ్చల్/రామంతాపూర్/కాప్రా, మార్చి 21: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పదో తరగతి పరీక్షలు మొదటి రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 230 పరీక్ష కేంద్రాలలో రెగ్యులర్ విద్యార్థుల మొత్తం 47,329 మంది విద్యార్థులకు.. 47,195 మంది విద్యార్థులు హాజరయ్యారని, 134 మంది విద్యార్థులు గైరాజరు అయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 140 మందికి 113 మంది హాజరు కాగా, 27 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని, మొత్తం 99.72 శాతం మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు.

– మేడ్చల్ : మండల విద్యాధికారి రంగాచారి అధ్వర్యంలో స్క్వాడ్ బృందం వివిధ పరీక్షా కేంద్రాలను సందర్శించి, పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. 11 పరీక్షా కేంద్రాల్లో 2300 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 2297 మంది హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరయ్యారు.

– రామంతాపూర్ : రామంతాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గంట ముందే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అధికారులు అనుమతించారు. ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. రామంతాపూర్ లోని పలు పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ ఏర్పాటు చేశారు.

– కాప్రా: పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆల్ ది బెస్ట్ చెప్పారు.





నాగారం ప్రభుత్వ పాఠశాలలో రూమ్ నంబర్, హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు, రాంపల్లిలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు..

పేదల సంక్షేమానికి న్యాయసేవాధికార సంస్థ కృషి

సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్

చర్లపల్లి, మార్చి 21: పేద ప్రజల సంక్షేమానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కృషి చేస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. టెన్త్ పరీక్షల నేపథ్యంలో ఓ కార్పొరేట్ స్కూల్ పేద విద్యార్థికి హాల్ టికెట్ ఇవ్వకపోవడంతో విద్యార్థి తల్లిదండ్రులు జిల్లా న్యాయసేవాధికార సంస్థకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే స్పందించి హాల్ టిక్కెట్‌ను ఇవ్వాలని సదరు స్కూల్‌కు అదేశాలు జారీ చేసింది. ఆయన మాట్లాడుతూ.. ఫీజులు చెల్లించలేదని పరీక్షలకు హాజరు కాకుండా నిరోధించడం సరైనది కాదనీ, విద్య అనేది జీవించే హక్కు కింద చేర్చబడిన కీలకమైన హక్కు అన్నారు. పేద కక్షిదారులకు ఉచిత న్యాయ సలహాలు అందించడంతోపాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం విద్యార్థి తల్లిదండ్రులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లి దండ్రులతోపాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న ఆశ వర్కర్లు

కీసర, మార్చి 21: ఆశ వర్కర్లను మూడవ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా నాయకురాలు కామ్రెడ్ జయప్రద, రాధ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆశ వర్కర్ల యూనియన్ కేంద్ర కమిటీ పిలుపుమేరకు కీసర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశ వర్కర్లకు ఫిక్స్ వేతనం నిర్ణయించి కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు యాదమ్మ, పుణ్యవతి, మంగ, భాగ్యలతో పాటు పలువురు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

‘మీట్ యూ’ యాప్ వాల్‌పోస్టర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, తదితరులు

నేరేడ్‌మెట్, మార్చి 21:యువత ప్రభుత్వ ఉద్యోగాలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఆధారపడకుండా వ్యాపార రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బోయినపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ‘మీట్ యూ’ యాప్ వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వయం ఉపాధితోపాటు మరికొందరికి ఉపాధి కల్పించాలన్నారు. యువత యొక్క స్వయం ఉపాధి ద్వారా దేశాభివృద్ధి తోడ్పడుతుందన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు యువత స్వయం ఉపాధికై రుణాల రూపేనా సహాయం చేయాలన్నారు. మీట్ యూ యాప్ ద్వారా మల్కాజిగిరిలోని ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ నాణ్యమైన చికెన్, మటన్ సాధ్యమైనంత త్వరగా డెలివరీ చేస్తామని నిర్వాహకులు గడ్డమీది శ్యామల, సాహిత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి చికెన్ షాపు ఓనర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

మేడ్చల్, మార్చి 21:మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి శుక్రవారం బోయినపల్లి క్యాంపు కార్యాలయంలో మేడ్చల్ మండలానికి చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు, ఎల్‌ఓసీలను అందజేశారు. మేడ్చల్ మున్సిపాలిటీకి చెందిన సిద్ధార్థకు రూ.2.25లక్షల ఎల్‌వోసీ, మేడ్చల్ మండలం శ్రీరంగవరం గ్రామానికి చెందిన నీలయ్యకు రూ.13,500 సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్

అంకిరెడ్డిపల్లిలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలోని విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్త

కీసర, మార్చి 21: జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్త సందర్శించారు. దమ్మాయిగూడ మున్సిపాల్టీ పరిధి అంకిరెడ్డిపల్లిలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సాయంత్రం సందర్శించి నేరుగా విద్యార్థినులను కలిసి పాఠశాలల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా? అంటూ అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

తూంకుంటలో మొక్కలకు నీళ్లు పడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్

శామీర్‌పేట, మార్చి 21 : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ అన్నారు. తూంకుంట పట్టణంలోని శుక్రవారం ఉదయం మార్నింగ్ వాక్ విత్ ఎంప్లాయీస్ అంటూ మున్సిపాలిటీని సుడిగాలి పర్యటన చేశారు. మున్సిపల్‌లోని కాలనీల్లో పర్యటించి పర్యావరణం పచ్చదనం, పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. తూంకుంట మున్సిపాలిటీలోని పట్టణ ప్రకృతి వనం, ఎవెన్యూ ప్లాంటేషన్, మిడిల్ లైన్ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలకు మాజీ సర్పంచ్ ఎద్దు నాగేశ్‌యాదవ్‌తో కలిసి నీళ్లు పోశారు. మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్, ట్యాక్స్ చెల్లింపులు సకాలంలో చేసి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇన్‌స్పెక్టర్ రూప, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

డివిజన్‌లో పవర్‌బోరును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మేకల సునీత రామయాదవ్

నేరేడ్‌మెట్, మార్చి 21: తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రామయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని న్యూ వెంకటేశ్వరనగర్‌లో చెడిపోయిన పవర్‌బోరుకు తన సొంత నిధులతో మరమ్మతులు చేయించి పవర్‌బోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. న్యూ వెంకటేశ్వరనగర్‌లో బాక్స్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. త్వరలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

బోడుప్పల్లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

సిటీ బ్యూరో: బోడుప్పల్లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నూతన బ్రాంచీని జోనల్ మేనేజర్ డీఎస్డీ ప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించారు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర విలువైన కస్టమర్లకు బోడుప్పల్లో సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 74 బ్రాంచుల్లో మెరుగైన సేవలందిస్తూ కస్టమర్ల మన్ననలు పొందుతున్నామని చెప్పారు.

అవసరమైన చోట్ల కొత్త పోలింగ్ బూత్‌లు

జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి గౌతమ్

వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 21: అవసరమైన చోట్ల కొత్త పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి గౌతమ్ అన్నారు. శుక్రవారం మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలోనే కాకుండా క్రమం తప్పకుండా సమావేశమై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలను, సూచనలను పరిగణనలోనికి తీసుకొని భారత ఎన్నికల కమిషన్‌కు పంపుతామన్నారు. జిల్లాలో జనాభా పెరుగుతున్నందున ఓటర్లు కూడా పెరగడం జరుగుతుందని, అందుకనుగుణంగా బూత్ లెవల్ ఏజెంట్లను నియమించాలని పార్టీ ప్రతినిధులకు సూచించారు. సరళీకృత ఓటరు జాబితాలను అవసరమైన మేరకు ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు చేస్తూ ఆ మార్పుల వివరాలను బీఎల్ఓలు ఓటర్లకు తెలియజేయాలని తెలిపారు. బూతులను షిఫ్టు చేయడం కష్టమని, అవసరమైన మేరకు కొత్త పోలింగ్ బూతులను ఏర్పాటు చేస్తామని, ఒకే కుటుంబసభ్యులు వేర్వేరు బూతులలో ఓటరు నమోదు ఉన్నట్లయితే ఫామ్–8లో బూతు మార్పుకు అప్లై చేసుకోవాలని సూచించారు. ప్రతినిధుల సూచనల మేరకు తండాలలో పరిశీలించి అవసరమైన చోట కొత్త బూతులను ఏర్పాటు చేస్తామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందరెడ్డి, డీఆర్ఓ హరిప్రియ, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

శామీర్‌పేట, మార్చి 21 : పరీక్ష కేంద్రాల్లో విద్యార్థుల కోసం మౌలిక సదుపాయాలు కల్పించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తూంకుంటను ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా తరగతి (పరీక్ష కేంద్రాలు)గదుల్లోకి వెళ్లి పరీక్షలు రాయడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు సౌకర్యాలు వంటివి ఉన్నాయా? అని ఎంఈఓను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. టెన్త్ పరీక్షలు పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ పరీక్షలు సజావుగా నిర్వహించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలన్నారు. ఈ పర్యటనలో శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంఈవో కమలాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

పీర్జాదిగూడ, మార్చి 21: పర్వతాపూర్‌లో ఓ ఇంటి తాళాలు పగులగొట్టి బంగారం, వెండి వస్తువులు తస్కరించిన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం... పర్వతాపూర్ సత్యనారాయణపురం కాలనీ రోడ్డు నంబర్–8లో నివాసముంటున్న గూడూరు ఉమా ఇంట్లోనే ఉంటుంది. అయితే గతేడాది డిసెంబర్ 20వ తేదీన కంటి ఆపరేషన్ చేయించుకుని స్థానికంగా ఉంటున్న తన కుమారుడి ఇంటికి వెళ్లింది. తిరిగి శుక్రవారం సాయంత్రం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం కనిపించింది. లోపలికి వెళ్లి చూసేసరికి 15 గ్రాముల బంగారు వస్తువులు, సుమారు 20 తులాల వెండి వస్తువులు కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు భావించిన బాధితురాలు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీఎంను కలిసిన బీసీ నాయకులు

రామంతాపూర్, మార్చి 21:విద్య, ఉద్యోగ స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించి శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం చేసినందుకు అసెంబ్లీ చాంబర్ లో రామంతాపూర్ బీసీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం బీసీ నాయకులు గడ్డం రవికుమార్, తవిడబోయిన గిరిబాబు, బరంపేట కృష్ణ ముదిరాజ్, విశ్వకర్మ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు లాల్కోట వెంకటాచారి, విశ్వకర్మ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు పబ్బోజు భిక్షపతి చారి తదితరులు పాల్గొన్నారు.

కిష్టాపూర్‌లో ఆహార భద్రతా శాఖ తనిఖీలు

ఫుడ్ ప్రాడక్ట్ కంపెనీలో ఉల్లంఘనలు

అనారోగ్యకర ఉత్పత్తుల తయారీ.. నిర్వాహకులపై కేసు

మేడ్చల్, మార్చి 21:మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్‌లోని పసుపు, కారం, పచ్చడి, మసాలాల తయారీ కేంద్రంపై తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారుల బృందం శుక్రవారం దాడి చేసింది. టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్‌ఫుడ్ ఇన్స్పెక్టర్ రోహిత్, (శ్రీషిక, స్వాతి, జగన్నాథ్‌లతో కూడిన బృందం కిష్టాపూర్‌లోని సర్వే నంబర్ 819లో ఉన్న హైదరాబాద్ ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్(సూర్య మసాలా, స్పైసెస్), లో ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఈ తనిఖీల్లో ఉత్పత్తుల తయారీలో నిర్వాహకులు ఉల్లంఘనలకు పాల్పడుతూ అనారోగ్యకర పరిస్థితి పసుపు, కారం, పచ్చళ్లు తయారు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. మసాలాలు, మసాలా పొడుల ఉత్పత్తి, నిల్వ విభాగాలలో తగిన పరిశుభ్రత పాటించడంలేదని, మసాలా ఉత్పత్తిలో ఉపయోగిస్తున్న ముడి పదార్థాలపై తగిన లేబుల్ సమాచారం లేనట్టు గుర్తించారు. పెచ్చులు ఊడిపోయిన గోడలు, దుమ్ము ధూళితో మురికిగా పాడై ఉండటం, మెష్ విండోలు దెబ్బతిని దాని నుంచి చెక్కముక్కలు అక్కడే నిల్వచేసిన పలు రకాల పికిల్ బ్యారెల్స్‌లో రాలిపడుతున్నట్టు గుర్తించారు. కీటకాలు, పురుగులు పట్టిన కొబ్బరిపొడి, ఎండుమిర్చి, ముడి పదార్థాలను నిల్వ గదిలో ఉన్నాయి. ఈ తనిఖీల్లో 46.75 క్వింటాళ్ల తయారైన పికిల్స్, అల్లం–వెల్లుల్లి పేస్ట్, మసాలా పొడులు ఉన్న రూ.3లక్షల 3వేల విలువైన నిల్వను సీజ్ చేసి, లోపభూయిష్టమైన నమూనాలను ల్యాబ్‌కి పంపించారు. మురికిగా ఉన్న కంటైనర్లు, ఫంగస్ పెరిగిన పదార్థాలు, వాడుక తేదీలు లేకపోవడం, అధిక దుర్వాసన కారణంగా కొన్ని ఉత్పత్తులను ధ్వంసం చేశారు. అనుమానిత ఆహార పదార్థాలను పరీక్షల నిమిత్తం శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు తరలించారు. నివేదికలో కల్తీ ఉన్నట్టు నిర్ధారణ అయితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్‌సేఫ్టీ అధికారులు హెచ్చరించారు. అపరిశుభ్ర ప్రాంతంలో మూతలు తీసిన దుమ్ముధూళి ఈగలతో కూడిన వండిన ఆహార పదార్థాలను, అధికంగా పలుమార్లు వేడి చేసిన వంట నూనెను గుర్తించారు. ఎఫ్ఎస్ఎస్ఏ సెక్షన్ల కింద నోటీసులు జారీ చేశారు. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్ జ్యోతిర్మయి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య రక్షణకు తెలంగాణ ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉందన్నారు. అనుమతులు లేకుండా చేసే వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శామీర్ పేట్, మార్చి 21: గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైన సంఘటన శామీర్ పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. తూంకుంట మున్సిపల్ వెంకటేశ్వర కాలనీలోని ఓ వెంచర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించారు. మృతుడికి సంబంధించి ఎలాంటి వివరాలు తెలియలేదని చొక్కా, చెప్పులు లేకుండా పాయింట్ మాత్రమే ధరించి మతిస్థిమితం లేకుండా గత కొన్ని రోజులుగా సంచరిస్తున్నాడని స్థానికులు తెలిపినట్లు వివరించారు. ఆహారంలేని కారణంగానో, వడ దెబ్బతగిలో మృత్యువాత పడి ఉంటాడని, దాదాపు వయస్సు 46 ఉండవచ్చునని పోలీసులు భావిస్తూ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

గోడ కూలి ముగ్గురికి తీవ్రగాయాలు

కీసర, మార్చి 21: గోడ కూలి ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని అహ్మద్‌గూడలో చోటుచేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జవహర్‌నగర్‌లోని చెన్నాపురం ప్రాంతానికి చెందిన భస్వప్ప(54), శరణప్ప(30), లక్ష్మణ్(32) ముగ్గురు కూలీలు దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడలోని పటేల్ ఫామ్‌హౌజ్‌లో పనిచేస్తుండగా.. ప్రమాదవశాత్తు గోడ కూలి ముగ్గురు కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ప్రాథమిక చికిత్స జరిపించారు. తీవ్ర ప్రమాదంలో ఉన్న ఆ కూలీలను అతి తక్కువ సమయంలో నగరంలోని గాంధీ దవాఖానకు తరలించారు.

ఇద్దరు బాలికలు అదృశ్యం

మల్కాజిగిరి, మార్చి 21:ఇద్దరు బాలికలు అదృశ్యమైన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అల్వాల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారంలో నివాసం ఉంటున్న ఇద్దరు బాలికలు గత రెండు రోజుల కిందట ఇంటి నుంచి బయటికి వెళ్లారు. శుక్రవారం బాలికల తల్లిదండ్రులు అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్నారు. అయితే మైనర్ బాలికలకు ఈనీఐఎల్, దమ్మాయిగూడకు చెందిన ఇద్దరు యువకులు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైనట్లు పోలీసులు గుర్తించారు. బాలికలిద్దరితో కలిసి ఓయో రూమ్‌లో గడిపినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. అల్వాల్ పోలీసులు వారిపై కిడ్నాప్, పోక్సో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం

సౌజన్య(ఫైల్)

పీర్జాదిగూడ, మార్చి 21: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వివాహిత అదృష్టమైన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం... బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సిద్ధి వినాయకనగర్ కాలనీలో నివాసం ఉంటున్న పరశురాం భార్య సౌజన్య (23)ఈనెల 19వ తేదీన ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆమె ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.